క్లుప్తంగా

కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడలో చికిత్స పొందుతున్న గోవిందుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దేవకుమారి

రామచంద్రపురం రూరల్: మండలంలోని కాపవరానికి చెందిన వలంటీర్ అమలదాసు దేవకుమారి గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు కొండాయపాలెపు గోవిందు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండటంతో అక్కడికి వెళ్లి పింఛన్ అందజేసింది. సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్‌లు వలంటీర్‌ను అభినందించారు.

ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

కె.గంగవరం: యర్రపోతవరం వేణుగోపాల స్వామి ఆలయానికి చెందిన భూములను మూడేళ్ల కాలపరిమితిగా బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి చెందిన సర్వే నంబర్ 95లో 2.45 ఎకరాలు, 52లో 8 సెంట్లు, 59లో 9 సెంట్లు, 61లో 0.21 సెంట్లు, 15లో 0.12 సెంట్లకు ఈ నెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద వేలం జరుగుతుందని పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళల్లో కార్యాలయం వద్ద సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బడుగు బలహీనవర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రామచంద్రపురం: బడుగు బలహీనవర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రణాళికాబద్ధంగా సంక్షేమ కార్యక్రమాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని 22వ వార్డు స్టీల్‌విల్‌పేటలో ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు రూ.10 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాల్ భవనానికి మంత్రి వేణు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణు మాట్లాడుతూ పట్టణంలోని స్టీల్‌విల్ పేటలో చాలా కాలంగా ఎక్కువ సంఖ్యలో నివసించే దళితుల కోరిక మేరకు కళ్యాణ మండపం



స్టీల్‌విల్‌పేటలో కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు తదితరులు

నిర్మించే విధంగా ప్రతిపాదనలు చేశామన్నారు. ఆ దిశగా ముఖ్యమంత్రి నిధులు రూ.10 లక్షలతో మున్సిపల్ స్థలంలో పనులకు శ్రీకారం చుడుతున్నట్లు మంత్రి చెప్పారు. కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం మూలంగా స్థానికంగా ఉండే దళితులు తమ సామాజిక కార్యక్రమాలను నిర్వర్తించుకోవటంతో పాటు తమ ఆశాలను నెరవేర్చుకోవటం జరిగిందన్నారు. రామచంద్రపురం పట్టణాన్ని అభివృద్ధి పరిచే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నట్లు మంత్రి వేణుగోపాలకృష్ణ తెలిపారు. వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు వాడ్రేవుసాయిప్రసాద్, కేతా శ్రీను, బావాల మంగామణి, మున్సిపల్ డీఈ డి.దుర్గాప్రసాద్, పార్టీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు సత్తి శంకర్‌రెడ్డి దొమ్మలపాటి సత్యనారాయణ, మందపల్లి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో జ్యేష్ట పౌర్ణమి పూజలు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఆదివారం జ్యేష్ఠ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠం అర్చకుడు చీమలకొండ శ్రీనివాస్ నేతృత్వంలో జ్యేష్ఠ నక్షత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విజయదుర్గా అమ్మవారికి లలితా సహస్ర నామాలు, లలితా, దుర్గా, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు చేశారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

సీసీఆర్‌సీ పొందడం కౌలు రైతుల హక్కు

కాజులూరు: సీసీఆర్‌సీ పొందడం కౌలు రైతుల హక్కు అని ప్రతి రైతు బాధ్యతగా కార్డులు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. మండలంలోని చేదువాడ, తిప్పరాజుపాలెం తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి సాగుదారుల చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు అర్హత పత్రాలు ఇచ్చేందుకు కొందరు భూయజమానులు ఇష్టపడటం లేదన్నారు. గ్రామాల్లో వీఆర్వోలే విచారణ చేపట్టి భూ యజమానుల అనుమతి అవసరం లేకుండా నిజమైన కౌలు రైతులకు పత్రాలు ఇవ్వాలన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి పరామర్శ

మండపేట: స్థానిక సంఘం కాలనీ అగ్నిప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ యువనేత తోట పృధ్వీరాజ్ బాసటగా నిలిచారు. రెండు రోజుల క్రితం కాలనీలో సంభవించిన అగ్ని ప్రమాదంలో కె.శ్రీనివాస్, దుర్గారావులకు చెందిన తాటాకుపాక దగ్ధం కావడంతో వారు నిరాశ్రయులయ్యారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని శనివారం వార్డు కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులతో కలిసి పృధ్వీరాజ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5000 చొప్పున ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దుర్గారావు అనారోగ్యం కారణంగా అతని పిల్లలు స్కూల్‌కు వెళ్లడం లేదని తెలిసి వారిని



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న పృధ్వీరాజ్

స్కూల్‌కు పంపాలని అందుకు అవసరమైన సహకారం అందజేస్తానన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్యబాబు, ములకాల చిన్న, కాటా గోవిందు, వత్తుమిల్లి బాపిరాజు, సత్తి శ్రీనివాస రెడ్డి, తోటకూర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

బలుసులమ్మకు మొక్కుల చెల్లింపు

రాయవరం: స్థానిక బలుసులమ్మ వారికి భక్తులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. పంచాయతీ సమీపంలోని బలుసులమ్మ అమ్మవారికి ఏటా తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. రాయవరం పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి అరటి గెలలు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, రవికెలతో పాటు నైవేధ్యాలు సమర్పించారు. కాగా శనివారం రాత్రి అమ్మవారి జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాండు మేళాలు, గరగ నృత్యాల వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా 'గాణాల'

రామచంద్రపురం: బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గాణాల రాజరాజేశ్వర కల్యాణ్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులకు వెల్లడించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజు జారీ చేసిన ఉత్తర్వులను రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా, జిల్లా పార్టీ అధ్యక్షుడు కర్రి చిట్టిబాబుల చేతుల మీదుగా పట్టణంలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నట్లు తెలిపారు. మోదీ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: తొలకరి సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని గొల్లపాలెం, బంధనపూడి తదితర గ్రామాల్లో ఆదివారం ఏఓ అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. బంధనపూడిలో ఆయన మాట్లాడుతూ గోదావరి తూర్పుడెల్టా కాలువకు ఇరిగేషన్ అధికారులు ఈ నెల ఒకటో తేదీన సాగునీరు విడుదల చేశారన్నారు. పంటకాలువల ద్వారా పొలాలకు సాగునీరు చేరు



బంధనపూడిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో అశోక్

తుందని రైతులు పంట దమ్ములకు సిద్ధం కావాలన్నారు. జూన్ రెండో వారం నాటికి నారుమడులు చల్లుకుని జూలై మొదటివారం నాటికి నాట్లు పూర్తి చేసినట్లయితే అక్టోబరు నెలాఖరు నాటికి పంట ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా చేతికొస్తుందన్నారు. తద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో దాళ్వా సాగు చేపట్టి మార్చి, ఏప్రిల్ నెలల్లో అంతర పంటలైన పెసర, మినుము మూడో పంటగా సాగు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందన్నారు. రైతులు చొరవ చూపి సాధ్యమైనంత త్వరగా తొలకరి పనులు ప్రారంభించాలన్నారు.